# “నేనును నీకు శిక్ష విధింపను”

# (8:1–11)

యోహాను సువార్త రచన అంతటిలో అనేకులకు ప్రీతికరమైన కథ 8వ అధ్యాయంలో ఉంది. ఈ భాగం 11 వచనాలతో కూడియుంది. అది క్రీస్తు పరిచర్యకు హృదయము మరియు ఆత్మ వంటిదైయుంది. అది అసలకు యోహాను సువార్తలో భాగం కాకపోవచ్చు;[1] అయినప్పటికి, యేసును గూర్చి మరువలేని బలీయమైన, శక్తివంతమైన రూప చిత్రాన్ని మనకు యిస్తుంది.

## సందిగ్ధావస్థను యేసు ఎలా సవరించాడు (8:1-9)

ఆయన సిలువ మరణానికి ముందటి వారం యేసు ఒలీవ కొండకు వెళ్లడం అనేది సర్వ సాధారణంగా మారిపోయింది.[2] ఉదయముననే ఆయన యెరూషలేమునకు తిరిగి వచ్చి దేవాలయంలో ప్రవేశిస్తూ ఉండేవాడు. ప్రజలు ఆయన చుట్టు మూగినప్పుడు, ఆయన కూర్చుండి బోధించుచుతూ ఉండేవాడు. ఇలా జరుగుతూ ఉండగా, ఒకప్పుడు వ్యభిచారిణిగా పట్టబడిన యొక స్త్రీని పరిసయ్యులును,[3] శాస్త్రులును ఆయన వద్దకు తీసికొని వచ్చారు. ఆ స్త్రీ పట్ల అక్కరగాని, దయగాని చూపకుండ వారు ఆమెను “వారి మధ్య నిలబెట్టారు” (8:3), బహిరంగ హేళనకు హేతువుగావించారు. ప్రధానమైన వారి ఆలోచన ఏదో త్వరలోనే బయటపెట్టారు. వాస్తవంగా అది ఆ స్త్రీ విషయం కాదు, కేవలం ప్రభువును చిక్కులో పెట్టడమే వారి ఉద్దేశమైయుంది.

“–బోధకుడా, యీ స్త్రీ వ్యభిచారము చేయుచుండగా పట్టబడెను; అట్టివారిని రాళ్లు రువ్వి చంపవలెనని ధర్మశాస్త్రములో మోషే మన కాజ్ఞాపించెను గదా; అయినను నీవేమి చెప్పుచున్నావని (వారు) ఆయన నడిగిరి” (8:4, 5). కొంతసేపటివరకు వారు ఆయనకు పరిపూర్ణమైన వల వేసినట్టు భావించారు. రుజువు విషయంలో యూదుల సభ కఠినమైన వైఖరి వహించింది. అనుమానంలో, లేక పుకారులో లేక యిద్దరు యింట ప్రవేశించినట్టు చూడడమో చాలదు. నిజంగా వ్యభిచారమనే కార్యం జరుగుతూ ఉండగా కన్నులారా చూచినవారి సాక్ష్యం ప్రకారమే ఆ నేరం స్థాపింపబడాలి, శాస్త్రులు, పరిసయ్యులు తెచ్చిన కేసు అట్టిదేనట.

యేసుకు వ్యతిరేకులైనవారు ఈ విషయంలో జాగ్రత్తపడ్డారు. ఆయనకు ఉచ్చు బిగించింది నిశ్చయమైనట్టు వారు భావించారు. ఆమెను రాళ్లతో కొట్టవద్దని చెప్పినట్టయితే ఆయన మోషే ధర్మశాస్త్రాన్ని మీరినవాడైయుండడా?[4] అంతకంటె ముఖ్యమైనది, అలాటి సమాధానం యేసును బలహీనుడుగాను, ధర్మశాస్త్రం నెరవేర్చే విషయంలో అపనమ్మకస్థుడు

గాను శాస్త్రులు పరిసయ్యులు ఆయనను చిత్రించేలా ఆయన దోహదం కలిగించే వాడౌతాడు. ఏదియెలాగున్నా, ఆయన దానికి వ్యతిరేకమైన స్థితిని తీసికొని, "ఆయన రాళ్లతో కొట్టమన్నట్టయితే!" తిరుగుబాటుదారుడు అనే నేరానికిని, రోమీయుల చట్టాన్ని తిరస్కరించాడన్న నేరానికి గురి చేయబడియుండేవాడే. ఎందుకంటె యూదులు మరణ శిక్ష విధించకూడని పరిస్థితిలో నిలిచియున్నారు.[5] రెండు విధాలుగానూ యేసు బదులిచ్చారు, ఆయనను ఒక మూలకు త్రోసినట్టు యూదా మత నాయకులు తలంచారు. ఈ పన్నాగం ఎంత తెలివితేటలతో కూడిందో మనం గ్రహించినప్పుడు ప్రభువైన యేసు ఎంతటి వివేచనతో బదులిచ్చాడో గ్రహించుకొన వీలుంటుంది.

వారి ఉద్దేశాలు దుష్టమైనవని యేసుకు తెలుసు (8:6). అయినా, వ్యభిచరించిన ఆ పురుషుడు ఎక్కడ? వ్యభిచారం అనేది ఒక వ్యక్తి తనకు తానే చేయగల పాపం కాదు. అయినప్పటికి కేవలం ఒక స్త్రీని మాత్రమే వారు తీసికొని వచ్చారు. వాస్తవానికి ప్రభువైన యేసును దిగ్భ్రమపరచడానికే వారు ఆసక్తిని కనుపరచారు గాని మోషే ధర్మశాస్త్రానికి లోబడాలనే భావం వారికి లేనేలేదు. వారికి కావలసింది అధికారమేగాని, నీతి కాదు.

### ఆయన వారికి బదులియ్యలేదు (6 వ.)

"జవాబు చెప్ప వీలుకాని ప్రశ్నను" యేసు తన వ్యతిరేకులనుండి ఎదుర్కొనినప్పుడు, ఆయన తొలి ప్రతిచర్య ఏమీ చెప్పక ఊరకుండుటయే! అందరి కన్నులు ఆయన మీద నిలిచియుండగా ఆయన ఒంగి నేలమీద ఏమో వ్రాస్తూ ఉన్నాడు (8:6). కొద్ది క్షణాలు ప్రభువైన యేసు చుట్టు భయంకరమైన నిశ్శబ్దము తాండవించినట్టుంది. ఆయన వారి ప్రశ్నలకు బదులివ్వ నిరాకరించాడు. ఆయన ఏమి చేస్తున్నాడు? ఆయన మరల ఎప్పుడు మాట్లాడతాడు? యూదా మత నాయకులు దీనిపై ఏమి చేయబోతారు?

ఏమి చెప్పకుండడమే కొన్నిసార్లు అతి శ్రేష్ఠమైన కార్యమై ఉంటుంది. జవాబు యివ్వకపోవడమే కొన్నిసార్లు బహు గొప్ప జవాబైయుంటుంది. సామెతలు 26:4, 5 యిలా అంటుంది:

> వాని మూఢతచొప్పున మూర్ఖునికి ప్రత్యుత్తర మియ్యకుము
> ఇచ్చినయెడల నీవును వాని పోలియుందువు.
> వాని మూఢతచొప్పున మూర్ఖునికి ప్రత్యుత్తర మిమ్ము
> ఆలాగు చేయనియెడల వాడు తన దృష్టికి తాను జ్ఞాననినుకొనును.

మొదటిగా, ఈ రెండు ప్రతిపాదనలు ఒకదానికొకటి వ్యతిరేకంగా ఉన్నట్టు గోచరిస్తాయి. అయినా, ఆలోచించినప్పుడు, బుద్ధిహీనుడు మూర్ఖంగా ఉండే అవకాశం ఉంది. తెలివి తక్కువగా ఉండే అవకాశం ఉంది. యోహాను 8లో ప్రత్యుత్తరం అవివేకంగా ఉంది. యేసు మాటలు ఎంత సత్యంగా ఉన్నా, సత్యం వినబడకపోయి ఉండవచ్చు. ప్రశ్న వక్రంగా ఉంది. రాజకీయ భావాలు హెచ్చు స్థాయిలో ఉన్నాయి, ఏ జవాబువలనైనా సత్యం సిద్ధించేటట్లు లేదు. ఆలాటి పరిస్థితిలో యేసు ఏమీ చెప్పలేదు.

**తిరిగి ఆయన వారిమీద దృష్టిని మరల్చాడు (7-9 వచ.)**

వారి ప్రశ్నకు బదులివ్వవలసిందిగా శాస్త్రులును పరిసయ్యులును ఒత్తిడి చేస్తున్నప్పుడు, ఆయన నిలిచి, క్రైస్తవుల మధ్య గత రెండు వేల సంవత్సరాలుగా మాటి మాటికి ఉపయోగించబడుతున్న మాటలను యిలా పలికాడు: "–మీలో పాపము లేనివాడు మొట్టమొదట ఆమె మీద రాయి వేయవచ్చును" (8:7) అని చెప్పి మరల వంగి నేలమీద వ్రాయుచుండెను. మరొకమారు వేదనకరమైన నిశ్శబ్దం ఆ గుంపు మీద పడింది. యేసు మాటలోని శక్తిని వారిలో ప్రతి ఒక్కడు గ్రహించియుండవచ్చు.

నేలమీద యేసు వ్రాసినదేమి? ఏమి వ్రాసిన సంగతి ఆ కథ మనకు చెప్పలేదు. ఆయన ఏమీ వ్రాయలేదు, ఆయన తన వ్యతిరేకులకు నెమ్మది లేకుండడానికి సమయ మిచ్చాడని కొందరన్నారు. శాస్త్రులు పరిసయ్యులు ఆ రోజున చేసిన దానిని ఖండించే లేఖన భాగాలను ఆయన నేలమీద వ్రాశాడని కొందరు ఊహించారు. ఆ స్త్రీ మీద నిందవేసిన వారి పాపాల జాబితాను ఆయన వ్రాస్తున్నట్టు కొందరన్నారు. ఆయన ఏమి వ్రాశాడో ఏమి వ్రాయలేదో గాని, ఆయన మాట్లాడిన ఆజ్ఞ దృష్టిని ఆ స్త్రీ మీదనుండి ఆమెను యేసు వద్దకు తీసికొని వచ్చిన వారి మీదికి మళ్లించింది.

తాము తోడుకొని వచ్చి వారి మధ్యను నిలబెట్టిన స్త్రీకి ఎంత అసౌకర్యం కలిగిందో "పాపములు లేనివాడు" అనే యేసు మాటలు వారిని అంతగా అసౌకర్యంలోనికి దించాయి. మరొక వ్యక్తి పాపం మీద దృష్టి నిలపడం సౌకర్యంగానే ఉంటుంది. మన సొంత పాపాన్ని ఎదుర్కోవలసి వచ్చినప్పుడు అది అలా ఉండదు. వారు ఎంతగా అసౌకర్యానికి గురయ్యారంటే, వారిలో ఎవడును మిగులకుండ పెద్దవాని మొదలు చిన్నవానివరకు అందరు ఆ చోటును విడిచి వెళ్లే గతి పట్టింది. ఆ గుంపు చేసిన తప్పుకు బాధ్యత వహించవలసి వస్తుందని వారిలో పెద్దవారు ముందుగా జారుకున్నట్టున్నారు. యేసు ప్రభువు ప్రత్యుత్తరంలోని జ్ఞానాన్ని వారిలో పెద్దవారే ముందుగా అభినందించి ఉండవచ్చు. వారి ఆలోచనలు ఏమైయున్నా, ప్రత్యుత్తరం చెప్పలేని వారి ప్రశ్నను అసాధ్యమైన ఆజ్ఞగా ఆయన మలచినట్లు వారు గుర్తించారు.

## ఆ వ్యక్తిని ప్రభువు ఎలా ఆదరించాడు (8:10, 11)

సందిగ్ధావస్థను బహు చాతుర్యంగా పరిష్కరించిన మీదట, ఒక వ్యక్తిని ఎలా ఆదరించాలో యేసు ప్రత్యక్షపరచాడు. ఆ మనుష్యులు వెడలిపోయిన పిమ్మట, యేసు తలయెత్తి చూచాడు. "అమ్మా, వారెక్కడ ఉన్నారు? ఎవరును నీకు శిక్ష విధించలేదా?" అని ఆమెను అడిగాడు (8:10). ఈ సమయానికి, ఆమెను గూర్చి మనకు ఎక్కువగా తెలియదని గ్రహించగలం. భయంకరమైన అన్యాయానికి గురియైన సహృదయంగల స్త్రీయని మనం చెప్పుకున్నా ఆమె పాపాన్ని గూర్చి తప్ప మనకి యింకేమియూ ఆమెను గూర్చి చెప్పబడలేదు! ఆమె "తనను నిందించే వారి మధ్య" నిలబడినప్పుడు (8:3, 9), ఆమె సాధువైనదా, ప్రీతిపాత్రమైనదా? లేక ఆమె కఠినురాలా? అసహ్యం పుట్టించేదా? అనేవి ఏవీ మనకు తెలియదు. అవమానంచేత నలిగిపోయి తనను నిందించుతున్నవారి

మధ్య తన కన్నీరు గుటకలు వేస్తుందా లేక దేవాలయానికి తన్ను తోడుకొని వచ్చిన వారిమీద కోపంతో తీవ్రంగా సూచించిందో తెలియదు. ఆమెను గూర్చి మనకు తెలిసినదంతా, వ్యభిచారం చేస్తూ ఉండగా ఆమె పట్టుబడింది. ఆమె పాపము దేవాలయపు ఆవరణంలో బహిరంగంగా బట్టబయలయ్యింది. ఈ కథను ఆశ్చర్యకరంగా చేసింది ఆ స్త్రీ కాదు, కాని ఆమెకు యేసు యిచ్చిన ప్రత్యుత్తరపు విధానమే.

**ఆయన ఆమెను గౌరవంగా చూచాడు**

జనులు నిన్ను గూర్చి మాట్లాడుకొంటున్నప్పుడు నీవెప్పుడైనా వారి మధ్య ఉన్నావా? పసివానిగా లేదా ఆస్పత్రిలో రోగిగా నీవు ఉండగా నీవు అక్కడ లేనట్టు మాట్లాడుకొంటున్న వారిని గూర్చి వినియుండవచ్చు. అది మానవత్వాన్ని తీసివేసి మాట్లాడుకున్న అనుభవంగా శాస్త్రుల పరిసయ్యుల చేతుల్లో ఆ స్త్రీ అనుభవించిన స్థితి అలాటిదై ఉంది. ఆమె ఒక సమస్యలా, ఒక వస్తువులా చూడబడింది. అంతకంటే ఏమీ ఎక్కువగా గుర్తించబడలేదు. ప్రభువైన యేసు ఆమెపై నేరం మోపిన వారికి తలవంపులు కలిగించిన మీదట, ఆయన ఆమెవైపు తిరిగి మాట్లాడాడు. ఆమెను గూర్చి గాక, ఆమెతో ఆయన మాట్లాడినది ఆ స్త్రీ ఎన్నడూ పొందలేనంత ప్రశస్తమైన బహుమానంగా ఉంది.

యేసు ఆమెను ఇబ్బంది కరమైన లోపంగా కాని, చిరాకు పుట్టించే కష్టంగా కాని చూడలేదు; ఆమెను ఒక వ్యక్తిగాను, బహు విలువగల దేవుని సృష్టిగాను ఆయన ఆమెను చూచాడు. సువార్త రచనలలో జనులతో మాట్లాడడం ప్రభువు యొక్క తరహాగా కన్పిస్తుంది. పైగా, ప్రభువు నేడు మనలను చూచే తరహా కూడా ఆలాటిదే. ఆయన మనలో ప్రతి ఒక్కరిని విలువైన వారంగా ఎంచి, బహు గాఢంగా మనలను ప్రేమిస్తాడు. పనికిరాని వారమన్నట్టు కన్పించే ఈ లోకంలో ప్రభువైన యేసు మనలను సగౌరవంగా చూస్తాడు. వ్యభిచారమందు పట్టుబడిన స్త్రీని ఆయన ఎదుర్కొన్న తీరు దీనిని గుర్తు చేసే బలమైన సత్యమై ఉంది.

**ఆయన ఆమెను దయగా చూచాడు**

ఆ స్త్రీని ప్రభువు సగౌరవంగా చూడడం మాత్రమేగాక, ఆమె యెడల ఆయన ప్రదర్శించిన తీరు ఆశ్చర్యమైన దయను కనుపరచుతోంది. ఆయన మొదటి దయగల కార్యం నేలమీద ఏమో వ్రాయడం. అది వింతగా ఉందా? ఆ దృశ్యాన్ని మరోసారి ఊహించి చూడు. ప్రభువు బోధిస్తున్న దేవాలయపు ప్రాంగణంలోనికి ఆమె ఈడ్చుకొని రాబడింది. మరియు ప్రభువును, అక్కడ ఉన్నవారందరును వినునట్లుగా ఆమె వ్యభిచారమందు పట్టుబడినట్లు బిగ్గరగా శాస్త్రులు పరిసయ్యులును చెప్పారు. ప్రతివాని నేత్రం ఆ అభాగ్యురాలిపై నిలుపబడియుండి ఉండవచ్చు. అంతకంటె అవమానకరమైనది యింకా ఏదైనా ఉంటుందా? ఆమెను ఏమి చేయాలని వారు యేసును అడిగినప్పుడు, ఆయన వంగి నేలమీద ఏమో వ్రాయనారంభించారు. ఆయన ఏమి వ్రాస్తున్నాడు? అందులో అర్థమేమైనా ఉందా? ఆయన ఎప్పుడు మాట్లాడతాడు? ఆయన ఉపదేశంలో పరస్పర విరుద్ధం ఉన్నట్టు యూదా మత నాయకులు చూపగలిగారా? అంతలో, ఎవరూ

ఆ స్త్రీ వైపు చూస్తున్నట్టు లేరు. ఆ స్త్రీపైనున్న వారి చూపులను తనవైపు మల్చుకొనడం యేసు ఆమెకు ప్రసాదించిన మొదటి ప్రశస్తమైన దయగల బహుమానమై ఉంది.

ఆ స్త్రీ మీద నేరం మోపినవారు వెడలిపోయిన తరువాత ప్రభువు ఆమెతో యిలా అన్నాడు: "నేనును నీకు శిక్ష విధింపను; ..." (8:11బి). "నేనును నీకు మరణ శిక్ష విధింపను" అనేది చట్టబద్ధమైన మాట. జనుల మధ్య తన పలుకుబడిని నిలబెట్టుకొనడానికి యేసు ఆ స్త్రీ యొక్క జీవితాన్ని బలి చేసి ఉండవచ్చునేమో కాని, ఆయన దాని చేయ నిరాకరించాడు. ఆ దినాన మొదటి రాయి వేయగల హక్కు ఎవరికైనా ఉండియున్నట్టయితే, అది, "నేనును నిన్ను శిక్షింపను" అని పలికిన ఆ ఒక్కనికే ఉండింది. "నేనును నిన్ను శిక్షింపను" అనేది ఆయన యివ్వగల మహా గొప్ప దయగల బహుమానమై ఉంది.

**ఆయన ఆమెను నిష్కపటంగా ఆదరించాడు**

ఈ కథను సెంటిమెంటల్‌గాను, పాపమంటే చులకనగా చూడబడినదిగాను తలంచే వారు యిందులోని ముఖ్యమైన భాగాన్ని అలక్ష్యం చేసేవారై ఉంటారు. యేసు ఆమెను తన దారిని పంపివేసినప్పుడు, "ఇక పాపము చేయకుమని ఆమెతో చెప్పెను" (8:11సి). ఆయన దయకలిగి ఉన్నాడు కాని ఆమె పాపాన్ని గూర్చి మాట్లాడినప్పుడు యథార్థంగా ఉన్నాడు. ఆమె పాపము ఎదుర్కోబడవలసి ఉంది. మన పాపాన్ని ఎదుర్కోకుండా తప్పించుకునే మార్గాలు నేడు అనేకాలున్నాయి. మనం పాపాన్ని అలక్ష్యం చేయడానికి ప్రయత్నిస్తుంటాం ("దాన్ని గూర్చి నేను ఆలోచింపను"), పాపం లేదంటాం ("నేనేమీ తప్పు చేయలేదు"), లేక పాపాన్ని సమర్థిస్తాం ("అది నేను నా తల్లిదండ్రులను బట్టి, నా ఉద్యోగాన్ని బట్టి, లేక నాగరికతను బట్టి చేశాను" అని అంటాం). ప్రభువైన యేసైతే, దానికి వ్యతిరేకంగా, ఆ స్త్రీ తన పాపాన్ని వదులుకోవలసిందిగా తెలిపాడు. ఆయన పాపాన్ని "పాపమనే" పిలిచాడు. నేడు మనము దానిని అలాగే చూడ బద్ధులమై ఉన్నాం. "దాన్ని గూర్చి చింతించకులే, అది పెద్ద సమస్య ఏమీ కాదు" అని పాపము విషయమై ప్రభువు చెప్పలేదు! దానికి బదులు, పాపము ఆయనకు అతి ముఖ్యమైన ఆలోచనయై ఉంది, ఆయనకు అది సిలువ అంత అక్కరయై ఉంది! విమోచన అనేది నిజంగా జరగాలంటే, మనం మొదటిగా వాస్తవాన్ని ఎదుర్కోవాలి, మరియు మన పాప దోషాన్ని ఎదుర్కోవాలి. మన పాప ఋణాన్ని మనం ఎన్నడు చెల్లించలేకపోయినా, మన పాప స్థితి విషయంలో యథార్థంగా ఉండాలి. లేకున్నట్టయితే, మారుమనస్సు కలిగే అవకాశము లేదు. మన పాపము యొక్క చెడువార్త ఎంత చెడ్డదో మనం గ్రహించేవరకు, సువార్త సందేశం ఎంతటి సువర్తమానమైయుందో మనం అభినందించలేం! తమ పాపాల విషయంలో తన ప్రజలు యథార్థవంతులై ఉండాలనియు, తమ కార్యాలకు తాము బాధ్యులై ఉండాలనియు ప్రభువు కోరుతున్నాడు.

**ఆయన ఆమెను కృపతోను, నిరీక్షణతోను ఆదరించాడు**

ప్రభువు ఆ స్త్రీ యొక్క పాపాన్ని క్షమించినట్టు ఈ లేఖన భాగంలో ఏ సూచనా

కన్పించదు. అయితే ఆమెకు మరణ శిక్ష విధించడానికి ఆయన నిరాకరించాడు. బేతెస్ద కోనేటి వద్ద కుంటివానిని బాగుచేయడంలో ఆయన వానికి చెప్పిన మాటలు ఈ సమయంలో మనకు జ్ఞాపకం వస్తాయి: "ఇదిగో స్వస్థతనొందితివి; మరి యెక్కువ కీడు నీకు కలుగకుండునట్లు ఇకను పాపము చేయకుము" (5:14). ప్రభువైన యేసు తనకు చేసిన ఉపకారంవలన ఆమె ప్రభావితం చేయబడిందో లేదో ఈ కథలో చెప్పబడలేదు. ఆమె విశ్వసించిందా? తన పాపం విషయమై మారుమనస్సు పొందేలా కదిలింపబడిందా? ఈ ప్రశ్నలకు జవాబులు మనకు లభించవు.

అయినా, ప్రభువు ఆమెకు భావి నిరీక్షణను ప్రసాదించాడు: "ఇకనుండి" (అక్షరార్థంగా, "ఇప్పటినుండి") ముందుకు చూడబడింది. ఒక ప్రత్యేకమైన పాపంచే ఒకడు గుర్తింపబడినప్పుడు (రెండు వేల సంవత్సరాల తరువాత కూడా ఆమెను "వ్యభిచారమందు పట్టబడిన స్త్రీ" అని మనం అనుకొనడం లేదా?) యిక ముందుకు చూచేదానికి బదులు ఎల్లప్పుడు వెనుకకు చూచే స్వభావం ఉంటుంది. పాపమే తన గుర్తింపుగా మారడం సులభమై ఉంటుంది. "నీ జీవితానికి పాపం కంటె అధికమైనది ఉంది. నీవు పాపంనుండి మరలవచ్చు"ననే ప్రభువు యొక్క సందేశం బిగ్గరగా వినిపిస్తుంది. ఆ వ్యభిచారపు స్త్రీకి అత్యవసరమైన సందేశం అదే. తన తోటి మానవులకు కాలమంతటిలో అవసరమైన సందేశం కూడా అదే. "కృపా సత్య సంపూర్ణుడైయున్న" యేసు ఒక క్రొత్త ఆరంభానికి మనలో ప్రతి ఒక్కరికి అవకాశం యిస్తున్నాడు.

## ముగింపు

ఆ స్త్రీ ఏమైయుంటుందో అని మనం ఆశ్చర్యపడేలా 8:1–11 కథ విడిచిపెట్టబడింది. ఆమె యేసును వెంబడించిందా, లేక తన వ్యభిచారపు పడకకు తిరిగి వెళ్లిందా? ప్రభువు తనకు ప్రసాదించిన ఆశ్చర్యకరమైన ఈవిని అభినందించి ఉంటుందని మనం తలంచుతాం. కాని బైబిలు దానిని మనకు తెలుపలేదు. అది అలాగుండడమే క్షేమం. ఎందుకంటె ఆ కథ ప్రాథమికంగా మనలో ప్రతి ఒక్కరికి సంబంధించిన కథయై ఉంది. మనం ప్రభువు యొక్క సందేశం విన్నప్పుడు, మనం కూడా మన పాపమందు "పట్టబడినవారమే." ఆ విషయం మనం కనుగొనబడ్డాం, మన పాపమును దేవుడు ఎరుగు, మరియు మనం దోషులమై ఉన్నాం.

ప్రభువైన యేసు వద్దకు ఆ స్త్రీని మాత్రమే తెచ్చి ఆమెతో వ్యభిచరించిన వానిని తోడుకొని రానందుకు కొన్నిసార్లు ప్రజలు తమ కోపావేశాన్ని కనుపరచుతారు. వాస్తవంగా ఆ దినాన ఆ స్త్రీ ధన్యురాలనే చెప్పాలి. తనతో వ్యభిచరించినవాడు శాస్త్రులు పరిసయ్యులకు చిక్కకుండ తప్పించుకొని ఉండవచ్చు. అయితే అతడు దేవుని దృష్టినుండి తప్పించుకోలేదు. తాను తప్పించుకొనగలిగినందుకు, తన పాపంతో బయటపడగలిగినట్టు ఆలోచించుకొని తనను తాను అవివేకిగా చేసికొని ఉండవచ్చు. అయితే, ఆ స్త్రీ మాత్రం తన పాపం యొక్క వాస్తవంనుండి తప్పించుకోలేదు. ఆ సంభవం తరువాత జరిగిన దానిని బట్టి ఆ స్త్రీ మేలు పొందింది కాని, పురుషుడు పొందలేదు. మనం పాపం చేయలేదని చెప్పుకో

జూచినంతకాలం, మన పాపాలను క్షమించే దేవుని కోర్కెను విసిగించుతూ ఉంటాం!

మనం ఆ స్త్రీవలె, జనుల మధ్య దోషులముగా నిలిచియుంటాం. మనం జరిగించింది, యోచించిందంతా జనులు ఎరిగి ఉన్నట్టయితే, వారు తప్పక మనలను దోషులుగా ఎంచుతారు. మనలను మనం ఎరుగగల దానికంటెను ప్రభువు మనలను ఎక్కువగా ఎరుగును. అయితే ఆయన మన పక్షంగా నిలిచియుంటాడు (కొన్నిసార్లు నేలకు వంగినట్టు), ఆ స్త్రీకి చేసినట్టుగానే. ఆయన మనకును నిందించే జన సమూహానికిని, మనకును మన దోష శిక్షకును మధ్య, మనకును సిలువకును మధ్య నిలిచియుంటాడు.

యేసు చేసినదానితో న్యాయం జరగలేదని సణుగుకొంటూ కొందరు దేవాలయం వద్దనుండి తమ యిండ్లకు వెళ్లిపోయి ఉండవచ్చు. "పాపము శిక్షింపబడాలని" కొందరు అని ఉంటారు. యోహానులో తరువాత దాఖలు చేయబడిన సంఘటనలవలన పాప ఋణం నిజంగా చెల్లింపబడినట్టు మనం గుర్తించగలం. "నేనును నిన్ను శిక్షింపను" అని పలికినాడు. "లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల"యే (1:29). ఆయన మన పాపమరణమును సిలువపై చెల్లించాడు. మరియు "–నేనును నిన్ను శిక్షింపను; నీవు వెళ్లి ఇక పాపము చేయకుమని" పాప శిక్షకు లోనైయున్న మనతో ఆయన చెప్పుతున్నాడు.

---

సూచనలు

[1]అనేక నవీన తర్జుమాల వలె NASB కూడా 7:53–8:11ను బ్రాకెట్లలో ఉంచి, యిది అనేక ప్రాచీన ప్రతులలో కన్పించడం లేదని సూచిస్తుంది. ఈ భాగం తరువాత కొన్ని గ్రీకు చేతి ప్రతులలో కన్పిస్తుంది, మరియు అది కూడా వేర్వేరు భాగాలలో కన్పిస్తుంది: యోహాను 7:36; 7:44; 7:52; 21:25; మరియు లూకా 21:38 వెంట వస్తుంది. ఏదియెలాగున్నా, ఈ భాగం దైవ ప్రేరేపితం కాదు గనుక అలక్ష్యం చేయుమని సూచించదు. "ఈ వర్ణనకు చరిత్ర సత్యమన్న గురుతులు ఉన్నట్టు" మెట్‌జెర్ అన్నాడు. (Bruce Metzger, *A Textual Commentary on the Greek New Testament* [Stuttgart, Germany: United Bible Societies, 1975], 200). ఇంతకు ఆదిలో 7:53–8:11 యోహాను సువార్త రచనలో భాగం కాకపోయినా, మొదటి శతాబ్దపు కరపత్రిక అయ్యేవరకు నోటి మాటగా అది చెలామణి అయ్యింది. అది ఒంటరిగా నిలువదగినంతటిది కానందున యోహాను సువార్త రచనలో దానికి 8వ అధ్యాయంలో తగిన స్థలం అమరింది. [2]లూకా 21:37లో పగటివేళ యేసు యెరూషలేములో బోధించుతూ, రాత్రికి ఆయన ఒలీవ కొండకు వెళ్లుతున్నట్టు సూచిస్తుంది. ఇది ఒలీవ కొండ చరియలో ఉన్న మరియ మార్తల యిల్లు అయి ఉండవచ్చు. [3]"శాస్త్రులు పరిసయ్యులు" అనేది సినాప్టిక్ గాస్పల్స్‌లో తరచుగా కన్పిస్తుంది. యోహాను సువార్త రచనలో అది యిక్కడ మాత్రమే కన్పిస్తుంది. [4]లేవీయ. 20:10; ద్వితీయో. 22:21–24 చూడు. [5]యోహాను 18:31 చూడు. అపొ. 7లో స్తెఫనును రాళ్లతో కొట్టడం దీనికి మినహాయింపు అయ్యుండవచ్చు, అది చట్టబద్ధమైన మరణ శిక్ష కాక, తుంటరి మూక యొక్క చర్యయై ఉంది.